క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ధోలారీధనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, దోలారీధనీ రోడ్డు, కొంపల్లి స్మశాన గడ్డ, హార్లిక్స్ వీధి, శ్రీకాంత్ నర్సరీ, ఎస్ఎస్ఆర్ అండ్ చంద్రారెడ్డి గార్డెన్స్ రోడ్డు. 11 కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎంఎన్‌కే విటాస్ విల్లాస్, దూలపల్లి రోడ్డు, నూజివీడు సీడ్స్ కంపెనీ, అశ్విని కాలనీ, బీఎస్ఎన్ఎల్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

జీడిమెట్ల ఫీడర్ పరిధిలో..
11 కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీడిమెట్ల గ్రామం, గ్రీన్ పార్కు, పిస్తా హౌస్, ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న షాపింగ్ మాల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని సబ్‌స్టేషన్ పేట్‌బషీరాబాద్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

లడ్డూ వేలం



లడ్డూ కైవసం చేసుకున్న సురేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద లడ్డూ వేలం పాటలు జోరందుకున్నాయి. శనివారం జీడిమెట్ల డివిజన్ మీనాక్షి ఎన్‌క్లేవ్‌లోని గణేశ్ మండపం వద్ద జరిగిన లడ్డూ వేలంలో సురేందర్‌రెడ్డి రూ.1.30 లక్షలతో సొంతం చేసుకున్నారు.

ఉచిత బస్సు డ్రైవింగ్ శిక్షణ

కుత్బుల్లాపూర్: నిరుద్యోగులైన ఎస్సీలకు టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత బస్సు డ్రైవింగ్ నేరిప్పించడంతో పాటు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఇప్పించడం జరుగుతుందని దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్ విజయభాస్కర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల 18–45 ఏళ్ల ఔత్సాహికులు ఈ నెల 28వ తేదీ లోగా కుల, ఆదాయ, ఆధార్, రేషన్, నివాస ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్‌పోర్ట్ ఫొటోలతో సూరారం మెయిన్‌రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్ భవనంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు 9347 80 1959, 9912642 175, 8184 83 7885 నంబర్లను సంప్రదించాలన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

దుండిగల్: ప్రైవేట్ కంపెనీల యాజమాన్యాలు ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతిలో పాలు పంచుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ భౌరంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెక్ మహేంద్ర కంపెనీ సౌజన్యంతో 12 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి హైటెక్ యుగంలో ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారిందని, విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విగ్నేష్, పిసరి కృష్ణారెడి , శ్యామ్‌రావు, శ్రీనివాస్ యాదవ్ సీతారామిరెడ్డి, నర్సింహచారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లో జరుగుతున్న భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రెహమాన్‌కు కబ్జాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 342లోని గుడి స్థలంలో ఓ వ్యక్తి నిర్మాణాలు చేపడుతుంటే ప్రశ్నించే పాపానికి దాడి చేశారని, అక్రమార్కులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో సాయినాథ్, శ్యామ్‌రావు, విగ్నేష్, పులి బలరామ్ ఉన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు బేబీ పాండ్ వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ట్రాఫిక్ సీఐ నర్సింహారావు, రమేష్ నాయక్‌తో కలిసి శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సజావుగా, సంప్రదాయబద్ధంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలను కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిమజ్జనం ఏర్పాటు చేయాలని, నిమజ్జన పాయింట్ల వద్ద బార్ కేడింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పాండ్‌లో తగినంత నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అల్లుకున్న ప్రమాదం



రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ ఇలా..

విద్యుత్ స్తంభాలకు అల్లుకుంటున్న తీగలను తొలగించడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పేరుతో తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నా ఆచరణలో మాత్రం నోచుకోవడం లేదు. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలనే ఇందుకు నిదర్శనం. రంగారెడ్డినగర్ డివిజన్ పరిదిలోని ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డు వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలకు పలు చోట్ల తీగలు అల్లుకుని అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారీ విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తీగలను తొలగించాలని కోరుతున్నారు. – రంగారెడ్డినగర్



ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డులో స్తంభానికి అల్లుకున్న తీగ

నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధిలో ముందంజ



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలో రూ. 15 కోట్ల పైచిలుకు అభివృద్ధి పనులకు ఆయన మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణరావుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 7వ డివిజన్ 191 కాలనీలో రూ. 13 లక్షలతో బస్తీ దవాఖానా, రూ.12 లక్షలతో ఓపెన్ జిమ్, రూ.45 లక్షలతో పార్కు ప్రహరీ 12వ డివిజన్‌లో వైకుంఠధామం, రూ. 15 లక్షలతో క్రీడా ప్రాంగణం. రూ.40 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ. 35 లక్షలతో థీమ్ పార్క్, ఇందిరమ్మ కాలనీలో రూ. 30 లక్షలతో కమిటీ హాల్, 14వ డివిజన్ వెంకటరాయ కాలనీలో రూ.30 లక్షలో కమిటీ హాల్, రూ.12 లక్షలతో ఓపెన్‌జిమ్, రూ.25 లక్షలతో బాలాజీ నగర్ పార్కు, ఆచారి కుంటల వద్ద టాయిలెట్లు, కేటీఆర్ కాలనీలో రూ. 20 లక్షలతో పార్క్ అభివృద్ధి, రూ. 10 లక్షలతో హైమాస్ట్ లైట్లు, 11, 12 డివిజన్లలో రూ.59 లక్షలతో బీటీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రవికిరణ్, ఆవుల పావని, రాజేశ్వరి, కో.ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదంపై సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న మహిళలు

కుత్బుల్లాపూర్: ఎన్నో దశాబ్దాలుగా మహిళలు వేచి చూస్తున్న 33 శాతం రిజర్వేషన్ చట్టాన్ని తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి, సెన్సార్ బోర్డు సభ్యురాలు సరిత అన్నారు. మహిళా బిల్లు ఆమోదంపై శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మహిళా బిల్లుపై చిత్తశుద్ధి చూపలేదని, బీజేపీ ప్రభుత్వం అన్ని పక్షాలతో ఏకతాటిపై తీసుకువచ్చి నేడు మహిళా బిల్లును ఆమోదింపజేసిందన్నారు. మహిళల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందనడానికి ఈ బిల్లే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సంధ్య, దుర్గా, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల అందజేత

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో చదివే ప్రతీ పేద విద్యార్థికి రాత పుస్తకాలు అందేల చూస్తానని కూనా కృష్ణగౌడ్, మహాలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూనా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం 129 డివిజన్ షాపూర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో రాత పుస్తకాలు, గడియారాలు, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 18 వేల మంది విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేసామని, ఇక ముందు కూడా అలాగే కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవి, రఘుపతి, సురేష్, రఘు, రమేష్, విజయలక్ష్మీ పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు వింటున్న శంబీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అందుబాటులో ఉంటానని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. శనివారం వివిధ కాలనీలకు చెందిన పలువురు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు చెందిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన, పూజలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేసారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమావేశం



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న వీసీ కట్టా నరసింహారెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో జె హబ్ గోల్డెన్ జూబ్లీ సెమినార్ హాల్‌లో శనివారం జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తెలంగాణ స్టేట్ డా. ఎం. మహేందర్‌రెడ్డి, ఐపీఎస్, ఇప్పనపల్లి చైర్మన్, సీఈఓ సీఐసీ గ్రూప్ యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికా డా. హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూఎస్ కెనడాకు వచ్చిన జేఎన్‌టీయూ విద్యార్థులకు అన్ని విషయాల్లో తోడుగా ఉండటానికి యూఎస్‌లో ఓ జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఏర్పాటు చేశానన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ సమావేశం ఏర్పాటు చేసిన డాక్టర్ సురేష్ కుమార్‌కు డాక్టర్ హరి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులు వారి లక్ష్యం కోసం యూనివర్సిటీలో ఉన్న అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని ముందుకు పోవాలన్నారు. రెక్టార్ డాక్టర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సమావేశంలో అనేక ఆలోచన ప్రస్తుతం చదువుతున్న వారికి ఎంతో ఉపయోగం అన్నారు. వీసీ కట్టా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. నేడు విద్యార్థులు బాగా చదువుతున్నారని, ఎంతో సంతోషించాల్సిన విషయమన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

జీడిమెట్ల: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎం. పవన్ వివరాల ప్రకారం.. చింతల్ వివేకానంద నగర్‌కు చెందిన తిరుపతి(37) మద్యానికి అలవాటు పడి నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. గత నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరుపతి ఎంతకీ రాకపోవడంతో సోదరుడు దీపక్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో సంఘటనలో..
షాపూర్‌నగర్ సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన తిరుపతి(19) చింతల్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ నెల19వ తేదీన కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుండి వెళ్లి ఇప్పటి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తిరుపతి కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోదరుడు రవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గురువందన్ చాత్రాభినందన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూల్ ఆవరణలో శనివారం భారత్ వికాస్ పరిషత్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ శాఖ ఆధ్వర్యంలో గురువందన్ చాత్రాభినందన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత్ వికాస్ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు అశ్విని సుబ్బారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 80 మంది పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి శాఖ మాజీ అధ్యక్షుడు జలవేందర్‌రావు, ప్రతినిధులు సుకృత్ కుమార్, శివరాతి యాదగిరి, కెన్నడి మూర్తి, సత్యనారాయణ, తటసుం సుబ్బారెడ్డి, రవిబాబు, వంచేల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శాస్త్రీయ తీగ వాయిద్య సంగీత పోటీలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని కృష్ణసింధూరి సంకల్ప లలిత కళల నిలయంలో జాతీయ స్థాయి శాస్త్రీయ తీగ వాయిద్య సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. హిందూస్థానీ, కర్ణాటక శాస్త్రీయ సంగీత తీగ వాయిద్యాల పోటీలు నిర్వహించనున్నట్లు, ఇందులో 25 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. తీగ వాయిద్యం, వీణ, వయోలిన్‌లలో వేర్వేరుగా పోటీలుంటాయని, అభ్యర్థులకు 10 నిమిషాలు మాత్రమే సమయం ఉంటుందన్నారు.ప్రవేశ రుసుము రూ.500ఉంటుందని తెలిపారు. ప్రతిభ కబబర్చిన వారికి ప్రథమ బహుమతి రూ.10వేలు,ద్వితీయ బహుమతి రూ.7 వేలు తృతీయ బహుమతి రూ.5 వేలను అందించనున్నట్లు తెలిపారు. వీణ, వయోలిన్ పాఠ్యాంశంలో రాగాలాపన, కృతి, స్వరకల్పన ఏదైనా ఒక రాగంలో, సితార్ పాఠ్యాంశంలో ఆలాప్, విలంబిత్, దృతగత్, తాన్, ఝులాలాలతో ఏదైనా ఒక రాగంలో ఈ పోటీ ఉంటుందన్నారు. పోటీలో అక్టోబర్ 1 ఆదివారం ఉదయం 10 నుంచి కేపీహెచ్‌బీకాలనీ 5వ ఫేజు, సెంట్రమ్ మాల్ ఎదురుగా ఉన్న సంకల్ప లలిత కళానిలయం కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కిందికుంట చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువు సుందరీకరణలో భాగంగా చెరువు ఔట్‌లెట్‌ను ఇరిగేషన్ అధికారులతో శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు చుట్టు పక్కన కాలనీవాసులు ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మురుగునీరు కలిసే చోట కాలనీల ఇన్‌లెట్, ఔట్‌లెట్ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని, తూమును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా చెరువుల సుందరీకరణ పనులను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విశ్వం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు అప్పిరెడ్డి, మహేష్‌రెడ్డి, సాయిబాబు, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాము, కేవీరావు, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సుచిత్ర వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ గన్‌పార్కులో వీరారెడ్డి, నరేందర్‌రెడ్డి పూజలు

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

గణేశ్ మండపాల్లో ప్రతిష్టించిన గణపతులు విశేష పూజలందుకుంటున్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానాలు నిర్వహించి వినాయక విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. అంతకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు ఆయా మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. – కుత్బుల్లాపూర్



గాజులరామారం గ్రామంలో గణేశుడి పూజలో కూన శ్రీనివాస్‌గౌడ్



ఎన్‌సీఎల్ నార్త్‌లోని ప్లేసెంట్ వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో..

ఎయిర్ వాల్వ్‌కు కంచె ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

చింతల్: ఎయిర్ వాల్వ్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయండి అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. జగద్గిరిగుట్ట నుంచి ఐడీపీఎల్‌కు వచ్చే 600 ఎంఎం పైప్‌లైన్‌కు గాంధీనగర్ సీఐడీ ఇండస్ట్రియల్ ఏరియా ప్లాట్ నెంబర్ వన్ వద్ద ఏర్పాటు చేసిన ఎయిర్‌వాల్వ్ కంచెను ఇటీవల దుండగులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. శనివారం సాక్షిలో కథను ప్రచురితం కావడంతో స్పందించిన వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి ఆదేశాలతో నూతన కంచెను ఏర్పాటు చేశారు.



వాల్వ్ చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘంలో ఏర్పాటు చేసిన గణపతికి శనివారం భక్తులు 108 ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. అలాగే ఉండ్రాళ్లతో వేసిన పటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. – కుత్బుల్లాపూర్



జేఎన్‌టీయూహెచ్‌లో అధ్యాపకుల నిరసన

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో అధ్యాపకులు సమ్మె చేస్తున్నారు. శనివారం స్పందన బ్లాక్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొద్దిసేపు నినాదాలు చేశారు.

చిరుధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన




అక్షరభ్యాస్యం చేయిస్తున్న స్పందన, సాయిబాబాయాదవ్

దుండిగల్: జాతీయ పోషణ సంబరాల్లో భాగంగా శనివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్పందన అధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ సాయిబాబాయాదవ్ మాట్లాడుతూ.. పూర్వకాలంలో చిరు ధాన్యాలు ఎక్కువగా తీసుకోవడంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారని, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా రాగులతో తయారు చేసిన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మీనాదేవి పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరిని వీడేదే లేదు

దుండిగల్: తాను మల్కాజ్‌గిరి నియోజకవర్గాన్ని వీడుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు మల్కాజ్‌గిరిని వీడేదే లేదని ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో మైనంపల్లి డైలామాలో ఉన్న కార్యకర్తలకు క్లారిటీ ఇచ్చారు. శనివారం దూలపల్లి అశోకా–ఏలా–మైసన్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనంపల్లి మాట్లాడుతూ.. కొంతమంది కావాలని కుత్బుల్లాపూర్, మేడ్చల్ నుంచి తాను పోటీ చేస్తున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఏదీ ఏమైనా తాను మల్కాజ్‌గిరి నుంచే పోటీ చేస్తానన్నారు.



మైనంపల్లి హన్మంతరావును కలిసిన భూపతిరెడ్డి తదితరులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

కూకట్‌పల్లి: సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. హోలిస్టిక్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించారు. ఈ క్యాంపులో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మ, కోఆర్డినేటర్ మురళీకృష్ణ, వెంకటశివ, పాఠశాల డీన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొని హెల్త్ చెకప్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపాలని తెలిపారు.